ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
సోమవారం 2 సెప్టెంబరు 2024



పశుగణన వాయిదా

విజయనగరం రూరల్, సెప్టెంబరు 1: ఈ నెల ఒకటి నుంచి నాలుగు నెలల పాటు జరగాల్సి ఉన్న పశుగణన కార్యక్రమం వాయిదా పడిందని పశు గణన కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి పూడి లోకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి మళ్లీ ఆదేశాలు వచ్చాక జిల్లాలో ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. పశుగణన కోసం జిల్లాలో సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు శిక్షణ పూర్తి చేసి ప్రత్యేక యాప్‌ను సిద్ధంగా వుంచామని, కేంద్ర ప్రభుత్వం తేదీని ప్రకటించిన వెంటనే జిల్లాలో పశుగణన ప్రారంభిస్తామని స్పష్టంచేశారు.



రేగిడి మండలం ఏవీపురం హస్టల్

ఇవేం హాస్టళ్లు?

- వార్డెన్ల కొరత ● పెరగని మెస్ చార్జీలు
- పక్కాగా అమలు కాని మెనూ ● రక్షిత తాగునీరూ అరకొరే
- ఐదేళ్ల వైసీపీ పాలనలో గాడితప్పిన వైనం

జిల్లా వ్యాప్తంగా 60 వరకూ ప్రభుత్వ వసతిగృహాలున్నాయి. దాదాపు 3,600 మంది వాటిలో ఉంటున్నారు. వార్డెన్లు మాత్రం 33 మందే ఉన్నారు. ఒక్కొక్కరు రెండు హాస్టళ్ల బాధ్యతలు చూస్తున్నారు. వాస్తవానికి ప్రతి హాస్టల్‌లో వార్డెన్, డిప్యూటీ వార్డెన్, కుక్, సహాయకులు, నైట్ వాచ్‌మెన్ ఉండాలి. దగ్గర్లో ఉన్న పీహెచ్‌సీ ఏఎన్‌ఎంలు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తుండాలి. కానీ వార్డెన్లు అరకొరగా ఉండగా మిగతా సిబ్బంది కాంట్రాక్ట్ ప్రతిపాదికన పని చేస్తున్నారు. రెండు మూడు హాస్టళ్ల బాధ్యతలు అప్పగించడంతో వార్డెన్లు పూర్తిస్థాయిలో సమయాన్ని కేటాయించలేక పోతున్నారు. దీనివల్ల విద్యార్థులూ గాడి తప్పుతున్నారు. కిందిస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కొన్నేళ్లుగా వార్డెన్ నియామకాలు చేపట్టలేదు. చాలా చోట్ల పదవీ విరమణ పొందిన వారి స్థానంలో కొత్త వారు రాలేదు. ఏడాదికేడాది వార్డెన్ పోస్టులు ఖాళీ అవుతున్నాయి.

ప్రభుత్వ వసతిగృహాలు గాడి తప్పాయి. ఎన్ని సమస్యలున్నా వాటిపై కనీస పర్యవేక్షణ లేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పూర్తిగా పట్టించుకోవడం మానేశారు. ముఖ్యంగా వార్డెన్ల కొరత వేధిస్తోంది. రెండు, మూడు హాస్టళ్లకు ఒక వార్డెన్ విధులు నిర్వహిస్తున్నారు. మెనూ అమలు, హాస్టళ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఆహారం పరిమాణం, నాణ్యత తగ్గుతోంది. రక్షిత నీరు కూడా అందించడం లేదు. అంతిమంగా ఆ ప్రభావం విద్యార్థులపై పడుతోంది.

\- రాజాం

- రాజాంలోని ప్రత్యేక బీసీ బాలుర వసతిగృహం వార్డెన్‌గా పనిచేస్తున్న పత్తిబాబుకు రేగిడి మండలం అంబాడ వెంకటాపురం, వంగర మండలం మద్దివలస సీతారాంపురం బీసీ బాలుర వసతి గృహాల బాధ్యతలనూ అప్పగించారు. రాజాం ఎస్సీ బాలికల వసతి గృహం వార్డెన్‌గా పని చేస్తున్న పావనికి సంతకవిటి మండలం గుళ్లసీతారాంపురం, సిరిపురం బీసీ బాలుర వసతి గృహాల బాధ్యతలను అదనంగా అప్పగించారు. అయితే ఇటీవలే సంతకవిటి మండలం గుళ్ల సీతారాంపురం, సిరిపురంకు వేరే వార్డెన్‌ను నియమించారు. తెర్లాం వార్డెన్‌కు రాజాంలోని ఎస్సీ ప్రత్యేక బాలుర వసతిగృహం ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు.

పాత ధరలతో భోజనం..

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అస్సలు డైట్ చార్జీలు పెంచలేదు. దీంతో వసతిగృహాల విద్యార్థులు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. అర్ధాకలితో గడుపుతున్నారు. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచకపోవడంతో వసతిగృహాల అధికారులు మెనూలో కోత విధిస్తున్నారు. వారానికి ఆరు రోజులు పెట్టాల్సిన కోడిగుడ్డును రెండు రోజులే పెడుతున్నారు. చికెన్ వారానికి ఒక రోజుకే పరిమితం చేస్తున్నారు. కూరల్లో నాణ్యత కొరవడుతోంది. అప్పుడెప్పుడో 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న నిత్యావసర ధరలను ఇప్పటితో పోల్చితే 100 నుంచి 150 శాతం పెరిగాయి. టీడీపీ ప్రభుత్వ హయంలో 2018లో చివరి సారిగా మెస్ చార్జీలు పెరిగాయి. అప్పట్లో విద్యార్థులకు మెనూ ప్రకారం సరైన ఆహారం అందించేవారు. ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదు. కరోనా ప్రవేశం తరువాత నిత్యావసరాల ధరలు వంద నుంచి 150 శాతం వరకూ పెరిగాయి. ప్రభుత్వం చెల్లించే ధరకు బయట మార్కెట్‌లో ఉన్న ధరకు భారీ వ్యత్యాసం ఉండడంతో ఏం చేయాలో వార్డెన్లకు పాలుపోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మెస్ చార్జీలను పెంచాలని కోరుతున్నారు.

అందని చార్జీలు..

జిల్లాలో చాలా వసతిగృహాల్లో దారుణ పరిస్థితులు ఉన్నాయి. అవసరమైన మేర మురుగుదొడ్లు లేవు. రక్షిత మంచినీరూ అరకొరే. మూడు నుంచి పదో తరగతి వరకూ ప్రీ మెట్రిక్ హాస్టళ్లకు సంబంధించి విద్యార్థులకు బ్రష్, టూత్ పేస్టు, తలకు నూనె రాసుకునేందుకు రూ.125 నుంచి రూ.150 వరకూ అందించాలి. పోస్టు మెట్రిక్ వారికి రూ.200 నుంచి 250 వరకూ అందించాలి. జుత్తు కత్తిరించుకోవడానికి రూ.50 ఇవ్వాలి. ఏడాదిగా చెల్లింపులు నిలిచిపోయాయి. రూ.1.50 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వణుకుతున్న జిల్లా

- జ్వరాల బాధితులతో ఆస్పత్రుల కిటకిట
- ఎక్కడికక్కడ మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, వైరల్ జ్వరాలు



రాజాం ప్రభుత్వాస్పత్రిలో రోగులు

విజయనగరం (ఆంధ్రజ్యోతి):

పల్లె, పట్టణాలు జ్వరాలతో వణుకుతున్నాయి. కొన్నిచోట్ల గ్రామాలకు గ్రామాలే జ్వరాలతో ఇబ్బందిపడుతున్నాయి. జిల్లా కేంద్రాస్పత్రి, రాజాం, బొబ్బిలి, ఎస్.కోట సామాజిక ఆస్పత్రులతో పాటు ప్రైవేటు ఆస్పత్రులు జ్వరపీడితులతో నిండిపోతున్నాయి. 2019 తరువాత ఈ స్థాయిలో జ్వరాలు ఎప్పుడు చూడలేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. వైరల్ ఇన్‌ఫెక్షన్ ప్రభావంతో ఎక్కువగా జలుబు, దగ్గు, జ్వరాలు వస్తున్నాయి. ఇంట్లో ఒకరి నుంచి ఒకరికి సోకుతుండడంతో కుటుంబ సభ్యులంతా మంచాన పడుతున్నారు.

సాధారణంగా జ్వరం వస్తే దాని లక్షణాలను అనుసరించి ఫలానా జ్వరమని నిర్ధారిస్తారు. జ్వరంతో పాటు కీళ్ల నొప్పులుంటే డెంగ్యూ అని.. శరీరంపై దద్దుర్లు ఉంటే గున్యా అని.. తీవ్రమైన జ్వరం ఉంటే మలేరియా, టైఫాయిడ్ అని ప్రాథమిక నిర్ధారణకు వస్తారు. అయితే గత కొద్దిరోజులుగా జిల్లాలో వెలుగుచూస్తున్న జ్వరాలు మాత్రం వైద్యులను గందరగోళానికి గురిచేస్తున్నాయి. గతంలో లేనంతగా ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు కిటకిటలాడుతున్నాయి. ఇదే అదనుగా ఫీజులను ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు పేరిట నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. వైరస్ కారణంగా జ్వరాలు వ్యాపిస్తున్నాయని చెబుతున్నా.. వ్యాధికారిక వైరస్ అనేది ఏమిటో తెలియడం లేదు. గతంలో వచ్చిన వైరల్ జ్వరాలు మందులు వేసుకున్నాక మూడు, నాలుగు రోజుల్లో తగ్గిపోయేవి. ఇప్పుడు వస్తున్న జ్వరాల ప్రభావం 7 నుంచి 10 రోజుల వరకూ ఉంటోంది. మొదటి రోజే శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీలకు చేరుతోంది.

- జ్వరపీడితుల్లో వికారం, నీళ్ల విరేచనాలు, కీళ్ల నొప్పులు, నీరసం, దగ్గు, గొంతునొప్పి, కళ్లమంటలు, ముక్కుకారడం తదితర లక్షణాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. శరీరంపై దద్దుర్లు ఏర్పడుతున్నాయి.
- ఆస్పత్రుల్లో ఒక్కసారిగా జ్వరపీడితులు పెరిగారు. సాధారణంగా వందల సంఖ్యలో ఉండే ఓపీ వేలకు పెరిగింది. ఈ ఏడాది ముందస్తు అంచనాల్లో వైద్య ఆరోగ్య శాఖ విఫలమైంది.
- జిల్లాలో జూలైలో 188 మలేరియా కేసులు నమోదయ్యాయి. ఆగస్టు నెలకు సంబంధించి 90 మలేరియా కేసులు నమోదయ్యాయి. అవే విధంగా ఈ ఏడాది మొత్తం డెంగ్యూ 105 కేసులు నమోదయ్యాయి.

చర్యలు చేపడుతున్నాం

కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఏఎన్ఎం, ఆశావర్కర్, హెల్త్ అసిస్టెంట్ ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై నెల రోజుల పాటు స్క్రీనింగ్ చేస్తారు. డెంగ్యూ, మలేరియా, డయేరియా, వైరల్ ఫీవర్స్‌పై ఇంటివద్దే వైద్యం అందిస్తున్నాం. మూడు రోజుల్లో తగ్గకపోతే ఇంటివద్దకు డాక్టర్ వస్తారు. ఇందుకు సంబంధించి మెడిసిన్ సిద్ధం చేశాం.

\- భాస్కరరావు, డీఎంఅండ్‌హెచ్‌వో

ఆడుకుంటూ మృత్యుఒడికి

- నీటి తొట్టెలో పడి మృతిచెందిన బాలుడు

బొబ్బిలి, సెప్టెంబరు 1:



మోక్షిత్(ఫైల్)

బొబ్బిలి పట్టణంలోని దేవాంగుల వీధికి చెందిన ఏడాది బాలుడు వెంగళ మోక్షిత్ నీటి తొట్టిలో పడి ఆదివారం సాయంత్రం కన్నుమూశాడు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిన్నారి మోక్షిత్ ఆదివారం సాయంత్రం ఇంటి ఆవరణంలో ఆడుకుంటున్నాడు. కుటుంబ సభ్యులంతా వారి పనుల్లో నిమగ్నమయ్యారు. బాలుడు ఆడుకుంటూ నీటి తొట్టెవైపు వెళ్లాడు. అంతలోనే అందులోకి జారిపోయాడు. బయటకు రాలేక ఊపిరాడక క్షణాల్లోనే ప్రాణాలు కోల్పోయాడు. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మోక్షిత్ విగతజీవిగా మారిపోయాడు. చిన్నారి మృతదేహాన్ని పట్టుకుని తల్లి పద్మావతి గుండెలు బాదుకుంటూ విలపించింది. ఇతర కుటుంబ సభ్యులంతా కన్నీరుమున్నీరుగా విలపించారు. మూడు రోజుల క్రితమే మోక్షిత్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ ఆనంద ఘడియలు కళ్ల ముందు ఇంకా కదలాడుతున్నాయని, అంతలోనే చిన్నారి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని తండ్రి నారాయణరావు వాపోయాడు. ఈయన విశాఖలో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. తల్లి పద్మావతి గృహిణి. వీరికి మూడేళ్ల వయసు కలిగిన పెద్దకుమారుడు ఉన్నాడు.

రూ.3 కోట్ల మళ్లింపు

- జీతాలకు నోచుకోని సేంద్రియ విభాగం సిబ్బంది
- అప్పట్లో నిధులు విడుదల చేసిన జర్మనీ సంస్థ
- 14 నెలల వేతనాలను దారిమళ్లించిన వైసీపీ సర్కారు
- ఆవేదనలో 259 మంది

వైసీపీ ప్రభుత్వం జర్మనీ సంస్థ నిధులనూ దారి మళ్లించేసింది. జిల్లాలో సేంద్రియ వ్యవసాయ విభాగానికి చెందిన 259 మంది జీతాల కోసం అక్కడి ఓ సంస్థ విడుదల చేసిన సుమారు మూడుకోట్ల రూపాయలను పక్కదారి పట్టించేసి వారి పొట్టకొట్టింది. 14 నెలల వేతనాలను ఆ సిబ్బంది కోల్పోయారు. ఈ పరిస్థితికి విసిగి సుమారు 69 మంది ఐసీఆర్పీలు రాజీనామా చేశారు.

మెంటాడ, సెప్టెంబరు 1:

రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో జిల్లాలో సేంద్రియ వ్యవసాయాన్ని (ఏపీసీఎంపీ) ప్రోత్సహించేందుకు జర్మనీ బ్యాంకు అయిన క్రెడిట్ ఇనిస్టిట్యూట్ ఫర్ రీ కనస్ట్రక్షన్స్ (కెఎఫ్‌డబ్ల్యూ) గతంలో ముందుకొచ్చింది. ఈ బ్యాంకు ఆర్థిక సహకారంతో జిల్లాలో మామిడి, జామి, అరటి, కూరగాయలు, చెరకు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాల సాగులో సేంద్రియ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఏటా లక్ష్యాలను పెంచుకుంటూ సేంద్రియ వ్యవసాయం పెరిగేలా కృషి చేస్తున్నారు. సాగుపై అవగాహన మొదలుకొని వాడకం ప్రోత్సహించేందుకు జిల్లావ్యాప్తంగా వివిధ స్థాయిల్లో ఉద్యోగులను నియమించారు.

- క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకు రమారమి 250 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరి జీతభత్యాలు, గౌరవవేతనాల కోసం నెలకు సగటున రూ.25 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. ఈ నిధులను జర్మనీ కెఎఫ్‌డబ్ల్యూ సంస్థ ఎప్పటికప్పుడు కేంద్రప్రభుత్వం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేస్తుంది. ఈ నిధులను వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమచేయాల్సి ఉంటుంది. అయితే జర్మనీ సంస్థ క్రమం తప్పకుండా సిబ్బంది జీతాల డబ్బులను విడుదల చేసినా గతేడాది జనవరి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు 14 నెలల పాటు ఆ డబ్బులు ఉద్యోగుల ఖాతాల్లో జమకాలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడ్డ ఉద్యోగులు, అధికారులు సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. గౌరవవేతనంపై ఆధారపడి కుటుంబాన్ని నెట్టుకొస్తున్న సుమారు 69 మంది ఐసీఆర్పీలు(ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్)లు విధులకు రాజీనామా చేశారు.



కషాయాలు తయారు చేయిస్తున్న సేంద్రియ వ్యవసాయ విభాగం సిబ్బంది(ఫైల్)

- కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వీరి వేతనాలు ప్రతినెలా సక్రమంగా అందుతున్నాయి. అయితే గత వైసీపీ సర్కారు హయంలో 14 నెలల బకాయి విషయంలో మాత్రం స్పష్టత లేదు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ (ఐసీఆర్పీ)మొత్తం 198 ఉండగా వివిధ కారణాల రీత్యా సుమారు 69 ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం వీరు 130 మంది పైగా ఉన్నారు. కాగా ఆ 14 నెలలకు గాను అధికారులు, సిబ్బందికి హోదాను బట్టి ఒక్కొక్కరికి రూ.లక్షనుంచి గరిష్ఠంగా రూ.మూడు లక్షల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది.
- ఏపీసీఎంఎన్‌పీ(ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్మెంట్ నేచురల్ ఫార్మింగ్) కింద జిల్లాలో 28 గ్రామాల్లో ప్రారంభించిన సేంద్రియ వ్యవసాయ సాగును సుమారు 250 గ్రామాలకు విస్తరించినట్లు అధికారులు చెబుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాం

ఏపీసీఎంఎన్‌పీ ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి కొన్ని నెలల వేతన బకాయిలు ఉండడం వాస్తవమే. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గత ప్రభుత్వం వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇప్పుడైతే చెల్లింపులు జరుగుతున్నాయి.

\- ఆనంద్‌రావు, జిల్లా ప్రోగ్రామింగ్ మేనేజర్

కాజ్‌వే పైనుంచి వరద నీరు

- మళ్లీ పారాది బ్రిడ్జి కష్టాలు ప్రారంభం ● వాహనాల దారి మళ్లింపు



పారాది కాజ్‌వేని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి /రూరల్ సెప్టెంబరు 1: బొబ్బిలి-రామభద్రపురం స్టేట్ హైవే (ఎస్‌హెచ్-004)లో బొబ్బిలి మండలం పారాది వద్ద వేగావతి నదిపై తాత్కాలికంగా నిర్మించిన కాజ్‌వేపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. భారీ వర్షాలకు నదిలో ప్రవాహం పెరగడంతో ఆదివారం సాయంత్రం నుంచి ఈ పరిస్థితి తలెత్తింది. గమనించిన అధికారులు వెంటనే వాహనాల దారి మళ్లింపునకు చర్యలు తీసుకున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న తుఫాన్ వర్షాలకు నదిలో క్రమేపీ వరద ప్రవాహం పెరిగింది. స్టేట్ హైవేలో చిలకపాలెం-రామభద్రపురం-రాయగడ రోడ్డు (సీహెచ్‌ఆర్‌ఆర్ రోడ్డు) అంతరాష్ట్ర రవాణాకు కీలకంగా ఉంది. ఈ హైవేలో పారాది గ్రామం దగ్గర వేగావతి నదిపై బ్రిటీషు కాలంలో నిర్మించిన పురాతన బ్రిడ్జి గడ్డర్ కుంగిన నేపథ్యంలో కొత్త బ్రిడ్జి పూర్తయ్యేవరకు ప్రయాణానికి కాజ్‌వే నిర్మించారు. అది కాస్త రెండుమూడు సార్లు వరదనీటిలో కొట్టుకుపోయింది. ఇటీవల ఈ కాజ్‌వేకు మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు నదిలో నీటి స్థాయి పెరగడంతో కాజ్‌వే పైనుంచి నీరు ప్రవహిస్తోంది. దీంతో ఆదివారం రాత్రి నుంచి వాహనాలన్నీ దారి మళ్లిస్తున్నారు.

వాహనాలను దారి మళ్లించాం

పారాది వేగావతి నదిపై నిర్మించిన కాజ్‌వేను ఆదివారం రాత్రి స్వయంగా పరిశీలించాను. కాజ్‌వే పైనుంచి వరదనీరు వస్తుండడంతో వాహనాల రాకపోకలకు అనువుగా లేదని గుర్తించాం. భారీ వాహనాలన్నింటినీ గతంలో మాదిరిగా దారి మళ్లించాం. పాత బ్రిడ్జిపై నుంచి తేలికపాటి వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నాం. - పి.శ్రీనివాసరావు, డీఎస్పీ, బొబ్బిలి

వర్షాలపై అప్రమత్తం

- ఎలాంటి నష్టం జరగకుండా చూడండి: కలెక్టర్
- నేడు విద్యా సంస్థలకు సెలవు

కలెక్టరేట్, సెప్టెంబరు 1: వాయుగుండం కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఎటువంటి నష్టం వాటిల్లకుండా అన్ని రకాలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంబేడ్కర్ అధికారులకు ఆదేశించారు. మండల నోడల్ అధికారులు, ఆర్‌డీవోలతో ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఆదివారం వర్షాలు కాస్త తెరిపి ఇచ్చినప్పటికీ ఇంకా కురిసే అవకాశం ఉందన్నారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల నోడల్ అధికారులు మండలాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. వైద్య శిబిరాలను కొనసాగించాలని, తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అవసరమైతే పునరావాస కేంద్రాలను, ఆహార పదార్థాలను సిద్ధం చేయాలన్నారు. జిల్లాస్థాయితో పాటు డివిజన్ , మండల స్థాయిలోనూ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ఇక్కడి సిబ్బంది 24 గంటలూ పని చేయాలన్నారు.

విద్యా సంస్థలకు నేడు సెలవు

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ప్రభుత్వం సోమవారం విద్యా సంస్థలకు సెలవు ప్రకటించింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలలు, కాలేజీలు, ఇతర విద్యా సంస్థలను మూసివేయాలని కలెక్టర్ అంబేడ్కర్ పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శ్రీకాకుళం • సోమవారం • 2 సెప్టెంబరు 2024
cinema@andhrajyothy.com







బాలయ్యతో కలసి ఓ ఫ్యాక్షన్ సినిమా చేయాలని ఉంది

నందమూరి బాలకృష్ణ నటుడిగా సినీ ఇండస్ట్రీలో యాభై వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర పరిశ్రమ, అభిమానులు కలసి ఆదివారం బాలయ్య సినీ స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ నోవాటెల్ ఆడిటోరియమ్ వేదికగా జరిగిన ఈ వేడుకకు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.దీనికి నందమూరి కుటుంబ సభ్యులతో పాటు మెగాస్టార్ చిరంజీవి, కమల్‌హాసన్, మోహన్‌బాబు, వెంకటేశ్, టి. సుబ్బరామిరెడ్డి, రఘు రామ కృష్ణం రాజు, కె. రాఘవేంద్రరావు, మురళీమోహన్, విజయేంద్ర ప్రసాద్, అశ్వినీదత్, సుహాసిని, మంచు విష్ణు, మాలాశ్రీ, నవీన్, రవి శంకర్, గోపీచంద్, బోయపాటి శ్రీను, పి.వాసు, జయసుధ కుటుంబం, విశ్వక్ సేన్, తదితరులు పాల్గొన్నారు. కన్నడ పరిశ్రమ నుంచి శివ రాజ్ కుమార్, ఉపేంద్ర కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'తెలుగు చిత్ర పరిశ్రమ అంతా కలిసి ఇలా వచ్చినందుకు అభినందిస్తున్నాను. 110 సినిమాలు చేయడం చాల కష్టం, మీరు 50 ఏళ్ల నుంచి సినిమాలు చేసినందుకు అభినందనలు. మీకు ఓపిక ఉన్నంత వరకు, ఊపిరి ఉన్నంత వరకు మీరు సినిమాలు చేయాలి. మేము అంతా మీతో ఉంటాం. జై బాలయ్య అనేది ఒక మంత్రం, అందులో ఉన్నంత ఎనర్జీ ఇంకా ఇక్కడ ఉండదు' అన్నారు. ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ 'బాలకృష్ణగారితో అసెంబ్లీలో కూర్చుంటూ ఉంటాం. ఇప్పుడు ఈ ఫంక్షన్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో వరదల కారణంగా ముఖ్యమంత్రిగారు రాలేకపోయారు. ఆయన తరఫున నేను వచ్చాను. బాలయ్య గారు సినిమా రంగంలో, వైద్య సేవ రంగంలో, రాజకీయ రంగంలో ఇలాగే కొనసాగాలి అని, దేవుడు మిమ్మల్ని నిండు నూరేళ్ళు చల్లగా ఉండేలా దీవించాలని కోరుకుంటున్నాను' అన్నారు. చిరంజీవి మాట్లాడుతూ 'ఇది బాలయ్యకు మాత్రమే కాదు తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన వేడుక.



చిరంజీవి

అరుదైన రికార్డ్‌ను బాలయ్య సొంతం చేసుకున్నందుకు ఆనందంగా ఉంది. ఎన్టీఆర్‌గారికి ప్రజల మదిలో ప్రత్యేక స్థానం ఉంది. బాలకృష్ణ తండ్రి చేసిన పాత్రలు సైతం చేసి ప్రేక్షకులను మెప్పించడం సామాన్యమైన విషయం కాదు. నేను ఇంద్ర సినిమా చేయడానికి కారణం బాలకృష్ణ చేసిన 'సమరసింహారెడ్డి' చిత్రం. బాలయ్యతో కలసి ఓ ఫ్యాక్షన్ సినిమా చేయాలన్నది నా కోరిక' అన్నారు.

కమల్ హాసన్ మాట్లాడుతూ 'అందరినీ గుర్తుపెట్టుకుని పలకరించే సంస్కారం ఉన్న వ్యక్తి బాలయ్య. ఆయనకు తండ్రి, దైవం, గురువు ఒక్కరే.. ఎన్టీఆర్ గారు. బాలయ్య అంటే స్వచ్ఛమైన మనసు, స్వేచ్ఛగా ఉండే మనిషి. ఆయన నిండు నూరేళ్ళు ఆరోగ్యంతో, ఐశ్వర్యంతో బావుండాలి అని కోరుకుంటున్నాను' అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'బాలయ్య గారు మీరు యాభై ఏళ్ల ఇలా నటనా రంగంలో ఉండటం, వైద్య రంగంలో ఇలా సేవ చేయడం మేము చూస్తూనే పెరిగాం. నాకు తెలిసిన వాళ్ళు కూడా మీ ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు. మీరు ఎప్పుడూ ఇలాగే నవ్వుతూ ఉండాలి' అన్నారు.





లింగవివక్ష, మహిళలపై లైంగిక వేధింపులపై మాలీవుడ్ చిత్ర పరిశ్రమ అట్టుడుకుతున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ ప్రకంపనలు క్రమంగా తెలుగు చిత్రపరిశ్రమను కూడా తాకుతున్నాయి. జస్టిస్ హేమ కమిటీ నివేదిక వెలువడిన నేపథ్యంలో చిత్ర పరిశ్రమలోని మహిళలపై వేధింపులను నిరసిస్తూ టాలీవుడ్ కథానాయిక సమంత మరోసారి గళం విప్పారు. టాలీవుడ్‌లో మహిళలపై జరుగుతున్న వేధింపులపై 2019లో ఏర్పాటు చేసిన సబ్ కమిటీ నివేదికను ఇప్పుడు బయటపెట్టాలని ఆమె తెలంగాణ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. దాన్ని బహిర్గతం చేయడం వల్ల తెలుగు చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులను అరికట్టేందుకు అవసరమైన విధి విధానాలను రూపొందించడంలో ప్రభుత్వానికి ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. వాయిస్ ఆఫ్ ఉమెన్ ఇన్ టీఎఫ్‌ఐ పేరుతో ఆమె సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్ అయింది. ఇండస్ట్రీలో మహిళా సమానత్వం, సురక్షితమైన పని వాతావరణాన్ని సృష్టించడం చాలా ముఖ్యం అని సమంత అభిప్రాయపడ్డారు. ఆ దిశగా అందరూ కలసి కృషి చేయాలని కోరారు. నటి మంచు లక్ష్మి, దర్శకురాలు నందినిరెడ్డి, గాయని చిన్మయి శ్రీపాద యాంకర్ సుమ కనకాల సహా పలువురు నటీనటులు సమంత సందేశాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసి ఆమెకు మద్దతు తెలిపారు.

ఆ నివేదికలో ఏముంది?

2018లో నటి శ్రీరెడ్డి మహిళల పట్ల ఇండస్ట్రీ వివక్ష చూపుతోందంటూ ఫిల్మ్ ఛాంబర్ వద్ద నగ్నంగా నిరసన ప్రదర్శనకు దిగారు. ఆ ఘటన నేపథ్యంలో 2019లో సీనియర్ ప్రభుత్వ అధికారులు, పోలీసులు, పౌర సమాజ ప్రతినిధులతో ప్రభుత్వం ఓ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. లైంగిక వేధింపులు, లింగ వివక్ష, వేతనాలు సహా పలు సమస్యలపై ఇండస్ట్రీలోని సంఘాలతో చర్చించిన కమిటీ 2022లో ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. అయితే ఇప్పటివరకూ దాన్ని ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. కానీ మీడియాలో ప్రచారం జరిగిన దాని ప్రకారం.. మహిళలను వేధించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించడం ఇండస్ట్రీలో సాధారణంగా మారింది. అలాగే నైట్ షిఫ్ట్‌లో పనిచేసేవారికి రవాణా సదుపాయం కల్పించడం లేదు. వేధింపులపై నోరు విప్పిన వారిని దోషుల్లా చూస్తున్నారు. యూనియన్ సభ్యత్వాల విషయంలో మహిళల పట్ల వివక్ష చూపుతున్నారు. చాలా యూనియన్లలో మహిళల సభ్యత్వం నాలుగు శాతానికి మించలేదు. దళారీ వ్యవస్థను ఉపయోగించుకొని నిర్మాతలు తక్కువ పారితోషికాలతో పని చేయించుకుంటున్నారు. డాన్స్, యాక్టింగ్ స్కూల్స్ నుంచి వచ్చే అమ్మాయిలను దళారులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. పని ప్రదేశాల్లో మహిళల సంరక్షణ కోసం ఉద్దేశించిన చట్టాలను పరిశ్రమలోని సంస్థలు అమలు చేయడం లేదు, ఫిర్యాదుల స్వీకరణకు అంతర్గతంగా కమిటీలను ఏర్పాటు చేయాలని, అందులో మహిళలు సభ్యులుగా ఉండేలా చూడాలని కమిటీ నివేదికలో పేర్కొన్నట్లు అప్పట్లో మీడియాలో ప్రచారం జరిగింది.

2019 నాటి సబ్ కమిటీ నివేదికను బయటపెట్టండి

- తెలంగాణ ప్రభుత్వాన్ని కోరిన సమంత
- మద్దతు పలికిన సినీ ప్రముఖులు



ఆ దిశగా ముందడుగు వేద్దాం

ఇండస్ట్రీలో మహిళల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, పరిశ్రమ సంఘాలు కలసి రావాలని సమంత అభ్యర్థించారు. సినీ ఇండస్ట్రీలోని పని ప్రదేశాల్లో లింగ వివక్ష ఏ రూపంలో ఉన్నా అరికట్టాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. హేమ కమిటీ నివేదికను ఉదహరిస్తూ పలు సూచనలు చేశారు. ఆ నివేదిక వచ్చాక చిత్ర పరిశ్రమలోని మహిళల్లో ధైర్యం వచ్చిందన్నారు. పని ప్రదేశాల్లో తాము ఎదుర్కొంటున్న వివక్ష దోపిడీని ప్రశ్నించేందుకు మరింత మంది మహిళలు తమ మౌనం వీడి ముందుకు రావడం మంచి పరిణామం అని చెప్పారు. లింగ అసమానతను అరికట్టేందుకు పారదర్శకమైన వ్యవస్థను కమిటీ సిఫారసు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తదనుగుణంగా లింగ వివక్ష లేని వాతావరణాన్ని పరిశ్రమలో కల్పించేందుకు ప్రభుత్వం, మూవీ అర్గనైజేషన్లు కలసి పనిచేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఆ దిశగా పునరాలోచిద్దాం, పునర్నిర్మిద్దాం, ముందడుగు వేద్దాం అని సమంత చెప్పారు.

సినిమా బతకాలి

మాలీవుడ్‌ను పవర్ సెంటర్ నియంత్రిస్తుందన్న హేమ కమిటీ వ్యాఖ్యలను నటుడు మమ్ముట్టి ఖండించారు. అలాంటిదేమీ ఇండస్ట్రీలో లేదు అని వివరణ ఇచ్చారు. అంతిమంగా సినిమా బతకాలనేదే తన కోరిక అని చెప్పారు. ఆయన ఆదివారం సోషల్ మీడియాలో స్పందించారు. 'నివేదిక కోర్టు ముందు ఉంది, నిందితులకు కోర్టు శిక్షలు నిర్ణయిస్తుందని చెప్పారు. షూటింగ్ ప్రదేశాల్లో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు కమిటీ చేసిన సూచనలను స్వాగతిస్తున్నాను, వాటి అమలు కోసం పరిశ్రమలోని అన్ని సంఘాలు ఏకతాటిపైకి రావాలి, మహిళలకు ఇబ్బందికర పరిస్థితులు రాకుండా దర్శక నిర్మాతలు జాగ్రత్తలు తీసుకోవాల'ని సూచించారు. హేమ కమిటీ నివేదిక గురించి స్పందించాలని మీడియా కోరగా దాని గురించి తనకేం తెలియదని రజనీకాంత్ బదులిచ్చారు.

భయపడేది లేదు

నటుడు జయసూర్య తనను వేధించాడంటూ నటి సోనియా మల్హార్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఆయనపై కేసు నమోదైంది. అయితే ఆ ఆరోపణల్లో నిజం లేదని జయసూర్య ఓ ప్రకటనలో తెలిపారు. తనపై తప్పుడు కేసు పెట్టిందని ఆరోపించారు. న్యాయం కోసం పోరాడుతానని చెప్పారు. దీనిపై సోనియా ఆగ్రహం వ్యక్తం చేశారు. బెదిరింపులకు భయపడేది, లేదు నా వ్యాఖ్యలను వెనక్కు తీసుకునేది లేదు అని తెగేసి చెప్పారు. తను చెప్పిన ప్రతి అంశం నిజమేనని పేర్కొన్నారు.

రిలీజ్ డేట్ మారింది



రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటించిన 'భలే ఉన్నాడే' చిత్రం ఈ నెల 7న విడుదల కావాలి. అయితే అనివార్యకారణాల వల్ల విడుదల తేదీని వాయిదా వేసినట్లు, 13న రిలీజ్ చేస్తామని చిత్ర నిర్మాత ఎన్.వి కిరణ్‌కుమార్ చెప్పారు. దర్శకుడు మారుతి సమర్పిస్తున్న ఈ చిత్రానికి శివ సాయి వర్ధన్ దర్శకుడు. సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ఈ సినిమాలో కీలక పాత్ర పోషించారు. అమ్మాయిలకు అందంగా అలంకరణలను చేసే పాత్రను ఇందులో రాజ్‌తరుణ్ పోషించారు. శేఖర్ చంద్ర సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి నగేశ్ బానెల్లా ఛాయాగ్రాహకుడు.

ఇన్ ప్రోగ్రెస్

రెండు ముఖాలు



నిఖిల్ దేవాదుల హీరోగా నటిస్తున్న 'ఘటికాచలం' చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఇందులో హీరో రెండు డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తున్నారు. ఒక లుక్ ఇన్నోసెంట్‌గా, మరో లుక్ ఇంటెన్స్‌గా ఉంది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో ఈటీవీ ప్రభాకర్, ఆర్వికా గుప్తా, జోగినాయుడు, సంజయ్‌రాయ్, దుర్గాదేవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. అమర్ కామెపల్లి దర్శకుడు. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామని చిత్రకథకుడు, నిర్మాత ఎం.సి.రాజు చెప్పారు.

మన బతుకులు కలలు కావు.. కళలు



దిలీప్‌ప్రకాశ్, రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలు పోషించిన 'ఉత్సవం' సినిమా థియేట్రికల్ ట్రైలర్ విడుదల చేశారు. హాస్యనటుడు బ్రహ్మానందం స్టేజ్ ప్లేలోని పవర్‌ఫుల్ డైలాగుతో ట్రైలర్ మొదలైంది. 'మన బతుకులు కలలు కావు.. కళలని గుర్తించే రోజులు రావా' అని ప్రకాశ్‌రాజ్ చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంది. దిలీప్, రెజీనాల లవ్‌ట్రాక్ ఈ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణ. నాటకాలు అంటే ఇష్టపడే యువతిగా రెజీనా నటించారు. ఈ నెల 13న విడుదలయ్యే 'ఉత్సవం'లో నాజర్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, అలీ, ప్రేమ, ఎల్బీ శ్రీరామ్ తదితరులు నటించారు. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేశ్ పాటిల్ ఈ సినిమాను నిర్మించారు.



సున్నా నుంచి 35 మార్కులు

నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజా ప్రధాన పాత్రలు పోషించిన '35.. చిన్న కథ కాదు' చిత్రం ట్రైలర్‌ను అక్కినేని నాగార్జున ఆదివారం విడుదల చేశారు. లెక్కల సబ్జెక్ట్‌తో ఇబ్బంది పడుతున్న ఓ స్టూడెంట్‌ను పరిచయం చేస్తూ ట్రైలర్ మొదలైంది. ఆ పిల్లాడి తల్లితండ్రులుగా నివేద, విశ్వదేవ్ నటించారు. కొడుకు భవిష్యత్ గురించి ఆందోళన చెందుతుంటారు. ఆ పిల్లాడిని టీచర్, క్లాసులో ఇతర స్టూడెంట్స్ 'సున్నా' అని పిలుస్తూ అవహేళన చేస్తుంటారు. ఆ కుర్రాడు సవాళ్లను అధిగమించి, 35 మార్కులతో ఉత్తీర్ణత సాధించడం ఈ చిత్రకథ. దర్శకుడు నందకిశోర్ ఈమని ఆసక్తికరంగా రూపొందించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదలవుతోంది. రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్దార్థ్ రాళ్లపల్లి నిర్మించారు.

తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు



హారర్ థ్రిల్లర్ 'డీమాంటీ కాలనీ 2' చిత్రాన్ని ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు హీరో అరుల్ నిధి ధన్యవాదాలు తెలిపారు. ఆగస్టు నెలలో విడుదలైన ఈ చిత్రాన్ని బి.సురేశ్‌రెడ్డి, మానస రెడ్డి తెలుగు ప్రేక్షకులకు అందించారు. ఆదివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో అరుల్ నిధి మాట్లాడుతూ ' తమిళంలో మా సినిమా బాగా ఆడుతోంది. తెలుగులో నిర్మాత సురేశ్‌రెడ్డి బాగా ప్రమోట్ చేశారు. ఆయన వల్లే సినిమా ఇంత పెద్ద విజయం సాధించింది. త్వరలో హైదరాబాద్ వచ్చి సక్సెస్ మీట్ నిర్వహిస్తాం' అన్నారు. ఈ సినిమాకు మరో రెండు సీక్వెల్స్ వస్తాయనీ, 'డీమాంటీ కాలనీ 3' భారీ స్థాయిలో ఉంటుందని, ఇందులో ఊహించని మలుపులు ఉంటాయనీ అరుల్ నిధి చెప్పారు. 'ఈ సినిమా పార్ట్ వన్‌లో ఒక పాత్ర చేశాను. పార్ట్ 2 లో రెండు పాత్రలు పోషించాను. పార్ట్ 3లో దర్శకుడు అజయ్ ఎన్ని పాత్రలు చేయిస్తారో చూడాలి. ఇంతవరకూ ఎక్కువగా థ్రిల్లర్, సస్పెన్స్ మూవీస్ చేశాను. ఇకపై ఇతర చిత్రాల్లో కూడా నటించాలనుకుంటున్నాను' అని చెప్పారు అరుల్ నిధి.

రెండేళ్ల కృషి ఫలించింది



యం.యస్.వి. సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఇటీవల ఈ చిత్రం విడుదలై అందరినీ అలరిస్తున్న సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సాగర్ మాట్లాడుతూ 'రెండేళ్ల మా కృషి ఫలించింది. మా సినిమాకు స్పందన బాగుంది. స్టార్స్ లేకున్నా కొత్త నటీనటులను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. మా సినిమాలో హీరోయిన్లు ముగ్గురూ బాగా చేశారు. కిరాక్ కిరణ్ పాత్ర బాగా పండింది' అన్నారు. హీరోయిన్లు హన్విక శ్రీనివాస్, ఉమా రేచర్ల, శ్రుతీ శంకర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గేటు పడితే నిరీక్షణే

- ఎస్‌కోట-పుణ్యగిరి రోడ్డులో రాకపోకలకు అవస్థలు
- ఫ్లైఓవర్ నిర్మాణానికి ముందుకు రాని రైల్వే శాఖ
- అత్యవసరమైతే పరిస్థితేంటన్న భయంతో స్థానికులు


ఎస్.కోట పుణ్యగిరి గేటు తెరవడంతో అస్తవ్యవస్తంగా వెళ్తున్న వాహనదారులు (ఫైల్)

● గతనెల ఆగస్టు 22 వతేదీన గురువారం సాయంత్రం 3గంటల సమయం లో శృంగవరపుకోట పుణ్యగిరి రోడ్డులోని రైల్వే గేటు మధ్యలో గూడ్స్ రైలు అడ్డంగా గంట పాటు ఆగిపోయింది. అటు, ఇటు కదలకుండా ఉండి పోవడంతో ఈ రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు గంటపాటు స్థానికులు ఏటువారటే ఉండి పోయారు. కాలినడకన వచ్చిన యువకులు, చిన్నపిల్లలు రైలు కిందకు దూరి పట్టాలను దాటుకుంటూ వెళ్లారు. పుణ్యగిరి వైపు నివాసాలు ఉన్నవారు ఎస్.కోట వైపు, ఎస్.కోటలో నివాసాలు ఉన్న వారు పుణ్యగిరి వైపు రైలు కదిలే వరకు గేటుకు ఇరువైపులా నిరీక్షించారు.

శృంగవరపుకోట

ఈ పరిస్థితి ఈ ఒక్కరోజే అనుకుంటే పొరపాటే. ప్రతి రోజూ ఈ రోడ్డులో ప్రయాణించేవారికి ఇది అనుభవమే. గంటకో, అరగంటకోసారి ఇక్కడ గేటు పడుతుంది. గూడ్స్ రైలు పావు గంటలో వస్తుందనగా గేటు పడుతుంది. గేటు దాటి వెళ్లిన మరో పావుగంటకు గేటు తెరుచుకుంటుంది. ఇలా గేటు పడినప్పుడల్లా కనీసం పావు గంట నుంచి అరగంట వరకు గేటు మూసే ఉంటుంది. తిరిగి గేటు తెరిచేవరకు రెండు వైపులా నిరీక్షించక తప్పడం లేదు.

శృంగవరపుకోట దేవీబొమ్మ కూడలి నుంచి పుణ్యగిరి దేవాలయం వరకు సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డు ఉంది. ఈ రోడ్డులో సబ్ జైలు, తహసీల్దార్ కార్యాలయం, ఖజానా కార్యాలయం, సబ్‌రిజిష్టర్ కార్యాలయం, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ప్రధాన బ్రాంచి), ప్రభుత్వ ప్రాంతీయ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, స్త్రీశిశు సంక్షేమ శాఖ, వెలుగు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయం, ప్రభుత్వ గృహనిర్మాణ శాఖ కార్యాలయం, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ, గ్రామీణ తాగునీటి శాఖ కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాలకు కొంతదూరంలో పుణ్యగిరి రోడ్డు మధ్య నుంచి కొత్తవలస-కిరోండల్(కెకె లైన్) రైల్వే లైను ఉంది. ఈ రైల్వే లైన్ దాటిన తరువాత బర్మాకాలనీ, గిరిజన బాలుర కళాశాల వసతి గృహం, వైఎస్ఆర్ కాలనీ, గిరిజన బాలికల కళాశాల వసతి గృహం, పుణ్యగిరి గ్రామం, రేగ పుణ్య గిరి గ్రామం, ఉమాకోటి లింగేశ్వర స్వామి (పుణ్యగిరి) దేవాలయం ఉన్నాయి. ఇటు నుంచి అటు వచ్చేవారు, అటు నుంచి ఇటోచ్చేవారు రైలు పట్టాలను దాటుకోని రావాలి. ఈ రైల్వేలైన్‌లో అత్యధికంగా సరుకు రవాణా చేసే గూడ్స్ ట్రైన్‌లు రాకపోకలు సాగిస్తాయి. ఐరిన్ ఓర్ సరుకుతో వెళ్లే ఈ ట్రైన్‌లు తరచూ రాకపోకలు సాగిస్తుండడంతో తరచూ ఇక్కడి గేటును మూసేస్తున్నారు.


గత నెలలో ఎస్.కోట పుణ్యగిరి గేటులో సుమారు గంట పాటు నిలిచిన గూడ్స్‌రైలు

గిరిజన బాలుర, బాలికల కళాశాలల వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థిని, విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు ఇటే ఉన్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాత్రమే అటు వైపు వుంది. దాదాపుగా 90 శాతం మంది విద్యార్థులు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఈ గేటు దాటి రాకపోకలు సాగిస్తున్నారు. ఇలాంటి సమయంలో గేటు పడితే అటు, ఇటు వాహనాలు బారులు తీరుతున్నాయి. బర్మాకాలనీ, వైఎస్ఆర్‌కాలనీ, పుణ్యగిరి, రేగ పుణ్యగిరి గ్రామాల్లో దాదాపుగా 1500 నుంచి 2000 కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రతి అవసరానికి ఈ గేటును దాటుకుంటూ పట్టణంలోకి రావాలి. కళాశాలలకు సమయం అవుతుందన్న తొందరలో ట్రైన్ వచ్చేసమయంలో కూడ కొందరు విద్యార్థులు గేటులో నుంచి వాహనాలను తీసుకువెళ్తున్నారు. రాకపోకలకు ఇన్ని ఇబ్బందులు కలుగుతున్న ఈ రైల్వే గేటు సమస్యను పరిష్కరించేందుకు రైల్వేశాఖ ముందుకు రావడం లేదు. ఈ గేటుపై ఫ్లైఓవర్ బ్రిడ్జిను నిర్మించాలన్న ఆలోచన చేయడం లేదు.

రాష్ట్ర విభజన అనంతరం అధికారం చేపట్టిన తెలుగు దేశం ప్రభుత్వంలో అప్పటి, ప్రస్తుత శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి ఈ సమస్యను రైల్వేశాఖ దృష్టికి తీసుకువెళ్లడంతో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు రైల్వే అధికారులు ప్రతిపాదించారు. అయితే ఈ అండర్ బ్రిడ్జి ఈ గేటు సమీపంలో కాకుండ దాదాపు కిలోమీటరు దూరంలో వున్న కర్నాటక కళ్లాల వద్ద వున్న రైల్వే గేటు వద్ద నిర్మించేందుకు ప్రణాళిక తయారు చేశారు. పుణ్యగిరి రోడ్డులో వున్న గేటు నుంచి ఎస్.కోట దేవిబోమ్మ కూడలికు 600 నుంచి 700 మీటర్ల లోపు దూరం వుంటుంది. ప్రభుత్వ ఆసుపత్రి, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు అర కిలోమీటరు దూరం కూడ వుండదు. ఇక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండ రైల్వే శాఖ ఈ గేటుకు దూరంగా కర్నాటక కళ్లాల గేటు వద్ద అండర్ బ్రిడ్జిని నిర్మిస్తామని చెప్పడంతో స్థానికులు నిరాకరించారు. రైల్వే లైనుకు ఇరు వైపులా రోడ్డు నిర్మాణంనకు సరిపడ స్థలం లేదు. రైల్వే లైనుకు ఆనుకుని నివాసాలు ఉండడంతో ఆటో, కారు వెళ్లేందుకు వీలుపడని పరిస్థితి వుంది. ఇలాంటి చోట చేసే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అభ్యంతరాలు రావడంతో ఈ ప్రతిపాదనకు తెరపడింది. ఇంతలో ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్లు దీని గురించి పట్టించుకున్న సందర్భాలు లేవు.

భవానీ దీక్షలు ప్రారంభం

రాజాం రూరల్: పట్టణంలోని నవదుర్గ అమ్మవారి సన్నిధిలో ఆదివారం భవానీ దీక్షలు ప్రారంభమ య్యాయి. సుమారు 2 వేల మందికి పైగా భక్తులు దీక్ష లు చేపట్టారు. వీరికి భవానీ గురుస్వాములు కూరాడ వెంకటరావు, దాసరి అప్పారావు తదితరులు మాల ధారణ చేయించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వానపల్లి నరశింగరావు సారథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస శర్మ పూజలు చేశారు.

మున్సిపల్ మేనేజర్ బదిలీ

రాజాం రూరల్: రాజాం మున్సిపాలిటీ మేనేజర్ ఎం.వి.నాగరాజుకు బదిలీ అయ్యింది. ఈయనను జిల్లాలోని బొబ్బిలి మున్సిపాలిటీలో మేనేజర్‌గా నియమిస్తూ మున్సిపల్ పరిపాలనా శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఏలేశ్వరం మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావును రాజాం మున్సిపల్ మేనేజర్‌గా నియమించారు. ఈయన గతంలో ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేశారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏపీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డా.డీవీజీ శంకరరావు కోరారు. ఆయన ఆదివారం గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి పీటీజీ గురుకుల పాఠశాల ఎస్టీ గురుకుల జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి ఆదేశించారు. వంట చేసే నిత్యావసర సరుకులు నాణ్యతగా ఉండాలని, పరిశుభ్రమైన రక్షిత మంచినీటిని సరఫరా చేయాలని, వేడివేడి భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఏపీ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యుగంధర్, పీటీజీ పాఠశాల వార్డెన్ వెంకటరావు తదితరులున్నారు. అనంతరం ఛైర్మన్ శంకరరావు భద్రగిరి ఆసుపత్రిని సందర్శించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్తానన్నారు.

తుప్పల తొలగింపు

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకుడు కోన సత్యనారాయణ సారథ్యంలో గ్రామ పార్టీ కార్యకర్తలు గ్రామానికి చెందిన శ్మశానంలో నాటిన తుప్పలు, డొంకలను తొలగించారు. సత్యనారాయణ తన సొంత ఖర్చుతో మనుషులను పెట్టి మొత్తం శ్మశానంలో తుప్పలను, డొంకలను తొలగించి శుభ్రం చేశారు.

రక్తదాన శిబిరం

కొత్తవలస: కొత్తవలస మండల యువత ఆధ్వర్యంలో ఆదివారం కొత్తవలస జంక్షన్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 50 మంది హాజరై రక్తదానం చేశారు. విశాఖపట్టణానికి చెందిన రోటరీ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. వారందరికీ సర్టిఫికెట్స్‌ను అందచేశారు. సీఐ ఈ శిబిరానికి హాజరై దాతలను అభినందించారు.

కొత్త బొద్దాంలో ఉచిత వైద్యశిబిరం

వేపాడ: మండలంలోని బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమాదేవి సారథ్యంలో కొత్త బొద్దాం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 62 మంది రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యాధికారి రమాదేవి మాట్లాడుతూ గ్రామస్థులు నీటిని వేడి చేసి చల్లార్చుకుని తాగాలన్నారు. కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ వైద్య శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ మూర్తి, శేకర్‌బాబు, సంతోషి, ఆశాలు పాల్గొన్నారు.

బాలయ్య స్వర్ణోత్సవ సంబరాలు

రాజాం రూరల్: శాసనసభ్యుడు, ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ సినీ రంగంలో 50 సంవత్సరాలు పూర్తచేసుకోవడంతో స్వర్ణోత్సవ సంబరాలు రాజాంలో ఆదివారం రాత్రి ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఎన్‌బీకే, ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో స్థానిక ఓ సినిమా థియేటర్‌లో కేకు కోసి, స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా గత నెలలో మరణించిన బాలకృష్ణ అభిమాన సంఘం నాయకుడు మురళీ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ అభిమానులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

పని సర్దుబాటు ఆపాలి

బెలగాం: పదోన్నతలు, బదిలీలు చేపట్టకుండా పని సర్దుబాటు చేయడం వల్ల ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా అన్నారు. ఆదివారం స్థానిక జూనియర్ కళాశాలలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.మహేష్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనివార్య పరిస్థితుల వల్ల చేపడుతు న్నామని చెబుతున్న పని సర్దుబాటును మండల స్థాయి లోనే ఆపాలని కోరారు. పాఠశాలల్లో ఖాళీలను విద్య వలంటీర్లతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఏకీకృత విధానాన్ని ఆమోదించబోమన్నారు.

మట్టి వినాయక ప్రతిమనే పూజించాలి

బొబ్బిలి రూరల్: బొబ్బిలి గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్వీ రమణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో రవికుమార్ చేతుల మీదుగా మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఎం చినగౌరునాయుడు, లక్ష్మణరావు, మల్లేశ్వరరావు, వివిఎస్ శర్మ, కృష్ణదాసు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి: బొబ్బిలి గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్వి రమణమూర్తి ఆధ్వర్యంలో సభ్యులు, ఆదివారం బొబ్బిలి రాజ దర్బార్ హాల్ లో నియోజక వర్గం ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన), కురుపాం నియోజక వర్గం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి చేతుల మీదుగా మట్టి వినాయక విగ్రహాలను పుర ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. మీసాల చిన గౌరునాయుడు, వనమిత్ర కృష్ణదాసు, వీఎన్ శర్మ, కె సత్యరాజు, చప్ప అప్పలనాయుడు, చప్ప తిరుపతిరావు, బాల భాస్కరరావు, లక్ష్మణరావు, మల్లీశ్వరరావు తదితురులు పాల్గొన్నారు.

విజయనగరం రూరల్: నగరంలోని గురజాడ కళా భారతి ఆడిటోరియంలో స్పార్క్స్ సొసైటీ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చెరువులు, జలజీవజాతుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలు వాడాలని కోరారు. సొసైటీ ప్రతినిధి పద్మనాభం, చంద్రిక, హోటల్ అసోసియేషన్ ప్రతినిధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, బేబీనాయన

చెరువులో పడి వృద్ధురాలి మృతి


అప్పలనర్సమ్మ (ఫైల్)

బొండపల్లి: ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, ఎస్ఐ యు.మహేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో ఎం.కొత్తవలస గ్రామంలో కంది అప్పలనర్సమ్మ(75) నివసిస్తోంది. ఆదివారం తెల్లవారుజామున అప్పలనర్సమ్మ కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ సమీపాన ఉన్న చెరువు గట్టుకు వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెందింది. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో మనవడు కడగల శ్రీనివాసరావు గ్రామ పరిసరాల్లో వెతకగా చెరువులో అప్పలనరసమ్మ విగత జీవిగా కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. మనవడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ యు.మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయనగరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పులిగూడ గ్రామానికి చెందిన తాడంగి అఖిల్ అనే ఐదో తరగతి విద్యార్థి ఆదివారం సెలవు రోజు కావడంతో గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆడుకుంటూ ప్రహరీపై నుంచి జారిపడ్డాడు. ఈ ఘటనలో తల వెనుక భాగంలో బలమైన గాయాలయ్యాయి. దీనితో అపస్మారక స్థితికి జారుకున్నాడు. వెంటనే గ్రామస్థులు ద్విచక్ర వాహనంపై భద్రగిరి సీహెచ్‌సీకి తరలించగా డాక్టర్లు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురంలోని ఏరియా ఆసుపత్రికి 108లో తరలించారు.

బలవంతంగా చందా వసూలు చేయొద్దు

- రికార్డు డాన్సులు, అశ్లీలనృత్యాలు ఏర్పాటు చేస్తే చర్యలు
- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం: జిల్లాలో గణేష్ ఉత్సవాల పేరుతో బలవంతంగా చందా వసూళ్లకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గణేష్ మండపాలు, పందిళ్ల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అని స్పష్టంచేశారు. శాంతియుతంగా గణేష్ ఉత్సవాల నిర్వహణకు ఆయా కమిటీల సభ్యులు సహకరించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు పేరిట అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్స్‌లు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వినాయక చవితి పండగను అల్లర్లు, ఘర్షణలకు తావులేకుండా నిర్వహించుకోవడానికి పోలీసు శాఖకు ప్రజలంతా సహకరించాలన్నారు. ఉత్సవాల నిర్వహణలో ప్రతి ఒక్కరూ మత సామరస్యాన్ని పాటించాలని, ఇతర మతాల వారికి ఎటువంటి ఇబ్బందులకు గురి చేయకుండా కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు.నిమజ్జనాల సమయంలో ప్రమాదకరమైన రంగులు జల్లుకోవడం, బాణసంచా కాల్చడం నిషేధమన్నారు.

చంద్రబాబును కలిసిన కళా


ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న కళావెంకటరావు

రాజాం: మొట్టమొదటిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి నేటికి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునా యుడును టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు ఆదివారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు మంచి పాలన దక్షత కలిగిన వ్యక్తి అని, పేదల కోసం, అభివృద్ధి సంక్షేమం కోసం ఎంతో తపించిన గొప్ప నాయకుడన్నారు.

సమస్యల పరిష్కారానికి సీఎం హామీ


చంద్రబాబునాయుడుకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ కార్యకర్తలు

వేపాడ: శృంగవరపుకోట నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారని విశాఖ జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు గోకాడ మహేష్ తెలిపారు. ఆదివారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో ఇంటింటి కొళాయిలు ఏర్పాటు చేయించాలని, రహదారులు శిదిలమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటి అభివృద్ధికి, నియోజకవర్గంలోని చాలా మంది అర్హులు పించన్లు అందక అవస్థలు పడుతున్నారని తదితర సమస్యలతో విజయవాడ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రిని కలిసి వినతపత్రం అందజేసినట్టు తెలిపారు.

జగ్గు చెరువు మదుం నుంచి నీరు పారేలా చర్యలు


కల్వర్టు పనులను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

శృంగవరపుకోట: శృంగ వరపుకోట జగ్గుచెరువు మదుం(కల్వర్టు) నుంచి వరద నీరు కిందకు పారేలా రెవె న్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. రెండు రోజు లుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు పుణ్యగిరి కొండల నుంచి వస్తున్న వరద నీటి తో జగ్గు చెరువు పూర్తిస్థాయిలో నిండింది. ఈ చెరువంతా గ్రామం పైగభాగంలో ఉంది. గట్టు ఏమాత్రం తెగినా గ్రామాన్ని ముంచెత్తుతోంది. పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ కార్యాలయం వద్ద పుణ్యగిరి రోడ్డులో ఉన్న ఈచెరువు మదుం దెబ్బతింది. దీన్ని గుర్తించిన గ్రామ రెవెన్యూ అధికారులు నెలిపూడి రమణ, కన్నయ్య అడివినాయుడు తదితరులు ఆదివారం తహసీల్దార్ అరుణకుమారి దృష్టిలో పెట్టారు. తక్షణ మరమ్మతులు చేపట్టాలని ఆదేశించడంతో వీరంతా జేసీబీ సాయంతో మదుం నుంచి పుణ్యగిరి గెడ్డలోకి నీరు పారేలా చేశారు. మదుం (కల్వర్టు) కుంగిన స్థానంలో పుణ్యగిరి రోడ్డును కొంత భాగం తవ్వారు. మిగిలిన రోడ్డు భాగం నుంచి స్థానికులు రాకపోకలు సాగించేందుకు చర్యలు తీసుకున్నారు. సాయంత్రం తహసీల్దార్ అరుణ కుమారి క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు.

ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది

శృంగవరపుకోట: ఉద్యోగ భద్రత కోసం నియోజకవర్గ మద్యం దుకాణాల సిబ్బంది ఆదివారం శృంగవరపుకోట దేవీబొమ్మ కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆందోళన చేపట్టారు. గత ఐదేళ్లగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న తామంతా బాధ్యతలను సక్రమంగా నిర్వహించామన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మద్యం విధానాలను మార్చుతున్నామని ప్రకటనలు ఇస్తున్నారని, మా ఉద్యోగ భద్రతకు మాత్రం హామీ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబునా యుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మా కుటుంబాల భవిష్యత్ కోసం ఆలోచించాలని కోరారు.

దోపిడీ దొంగల అరెస్టు


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

గరివిడి: జిల్లాలో సంచలనం రేపిన ఈనెల 21వ తేదీన గరివిడి మండలం అప్పన్నవలస సెంటర్ వద్ద అర్ధరాత్రి జరిగిన దారి దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ మేరకు గరివిడి ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసరావు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 21వ తేదీ అర్ధరాత్రి రాజాంకు చెందిన ఇద్దరు బంగారు వ్యాపారస్థులు హుస్సేన్ మల్లిక్, బిల్వర్ హుస్సేన్ అనే ఇద్దరు వ్యాపారస్థులు విజయనగరం నుంచి రాజాంకు బైకుపై వెళ్తుండగా ఐదుగురు నిందితులు వారి ముఖంపై కారం చల్లి ఇనుపరాడ్డులతో కొట్టి, నాటు తుపాకీతో దౌర్జన్యానికి పాల్పడ్డారని తెలిపారు. నిందితులలో ముబారక్, అబ్బీర్ హుస్సేన్, సఫీర్ గాజీలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని చెప్పారు. మరో ఇద్దరు నిందితులైన సబ్బీ, రహీమ్‌ల కోసం గాలిస్తున్నామన్నారు. నిందితులందరూ పశ్చిమ బెంగాల్ ప్రాంతానికి చెందిన వారని తెలిపారు. చీపురుపల్లి సీఐ శంకరరావు, సీపీఎఫ్ సీఐ సత్యనారాయణ, గరివిడి ఎస్ఐ దామోదరరావు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన గోడ

వంగర: తుఫాన్ కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ఓనిలో ఆవు సూర్యనారాయణకు చెందిన ఇంటిగోడ కులి పడిపోయింది. అందరూ పనులకు వెళ్లిన సమయంలో గోడ కూలడంతో పెనుప్రమాదం తప్పింది. సూర్యనారాయణ ఇంట్లో ఐదుగురు ఉంటున్నారు. గోడ కూలిన సమయంలో పిల్లలు భయట ఆడుకోవటానికి వెళ్లగా, పెద్దలు పొలంపనులకు వెళ్లటంతో పెనుప్రమాదం తప్పింది.

పాతబొబ్బిలి ప్రధాన రహదారిని సందర్శించిన బేబీనాయన

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా టీఆర్ థియేటర్ ప్రాంతంలో రోడ్డుపై నీరు నిలువ ఉండిపోవడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విషయం ఎమ్మెల్యే బేబీనాయన దృష్టికి రాగా ఆదివారం కమిషనర్ రామలక్ష్మి తో కలిసి సందర్శించారు.

క్యాన్సర్ ఆసుపత్రికి సాయం అందిస్తాం


దివ్యాంగుల కోసం తయారుచేస్తున్న కృత్రిమ అవయవాలను చూపిస్తున్న జగదీష్ బాబు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మాణం చేస్తున్న శ్రీవిజయశ్రీ మెమోరియల్ క్యాన్సర్ ఆసుపత్రికి తమ వంతు సాయం అందిస్తామని విశాఖపట్టణానికి చెందిన రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్(ఆర్ఎస్ఐఎల్) సీఎండీ అతుల్ భట్ తెలిపారు. ఆదివారం మంగళపాలెంని గురుదేవ చారిటబుల్ ట్రస్టును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ట్రస్టు ఛైర్మన్ రాపర్తి జగదీష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న కృత్రిమ అవయవాల తయారీ కర్మాగారాన్ని, గురుదేవ ఆసుపత్రిని సందర్శించారు. నూతనంగా ఆసుపత్రి సమీపంలో నిర్మాణం చేస్తున్న క్యాన్సర్ ఆసుపత్రి భవనాలను పరిశీలన చేశారు. ఈ సేవా కార్యక్రమాలను ఇలానే కొనసాగించాలని, తమ సంస్థ అవసరమైన సహాయ సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ సురేష్ బాబు, ఇమంది శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే కోళ్ల


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కోళ్ల

లక్కవరపుకోట: మండలంలోని శ్రీరాంపురం వద్దగల స్టీల్ ఎక్సేంజ్ ఇండియా కర్మాగారంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆర్ఐఎస్ఎల్ సీఎండీ అతుల్ భాట్‌తో కలిసి మొక్కలు నాటారు. వనమహోత్సవంలో భాగంగా కర్మాగారం ప్రాంగణంలో, చుట్టూ పర్యావరణానికి పనికివచ్చే మొక్కలను నాటాలని యాజమాన్యానికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు ఎక్కువ ప్రాధాన్యం, ఇస్తోందని దానిని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. కంపెనీ డైరెక్టర్ బి.సురేష్, సీఎండీ రినల్, జగదీష్‌బాబు, కంపెనీ యాజమాన్యం పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం


మొక్కలు నాటుతున్న జనసేన నాయకులు మిడతాన రవి, మర్రాపు సురేష్

విజయనగరం (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని జన సేన నాయకులు మిడతాన రవికుమార్, మర్రాపు సురేష్ అన్నారు. ఆదివారం ఉపము ఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా బొండపల్లి మండలంలోని మరువాడ కొత్తవలస ప్రభుత్వ పాఠశాలలో క్లీన్ ఆంధ్రా, గ్రీన్ ఆంధ్రా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పవన్‌కల్యాణ్ ఆశయసాధనలో జనసైనికులు అంతా భాగస్వామ్యులు కావాలన్నారు. అందరూ బాధ్యతగా ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, ఇంటి ఆవరణలోనూ, బహిరంగ ప్రదేశాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. మున్నా, శేఖర్, శ్రీను, ఉదయలక్ష్మణతో పాటు, అప్పలరాజు, జనసైనికులు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి

- యూపీఎస్ తాత్కాలిక పరిష్కారమే
- నిరసన తెలిపిన ఉద్యోగసంఘాలు

సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ, వాటిని రద్దు చేసి పాత పెన్షన్ విధానమైన ఓపీఎస్‌ని అమలు చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. ప్రభుత్వం ఉద్యోగులకు అన్యాయం చేయకూడదని డిమాండ్ చేశారు. -(ఆంధ్రజ్యోతి బృందం)



బొబ్బిలి రూరల్: ఏపీటీఎఫ్ సభ్యుల నిరసన


విజయనగరం: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గాదె



రాజాం రూరల్: ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు


గుమ్మలక్ష్మీపురం: ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

అలుపెరుగని పోరాట యోధుడు చంద్రబాబు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున

చీపురుపల్లి: రాష్ట్ర ప్రయోజనాల కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలుగు ప్రజల కోసం ఆయన నిరంతరం శ్రమించారన్నారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసి, సైబరాబాద్‌కు రూపకల్పన చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి పూర్వ వైభవం తేవడం, పోలవరం ప్రాజక్టును పూర్తి చేయడం చంద్రబాబు వల్లే సాధ్యమవుతుందన్నారు. శాంతియుత వాతావరణంలో పాలన సాగించగల పాలనాదక్షత ఆయన సొంతమని నాగార్జున అన్నారు.

సమర్థతగల ముఖ్యమంత్రి..

చీపురుపల్లి: రాష్ట్ర చరిత్రలోనే సమర్థత కలిగిన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు గుర్తింపు పొందారని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. 1995 సెప్టెంబరు 2న ఆయన తొలిసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారన్నారు. పార్టీని, ప్రభుత్వాన్ని సమర్థంగా నడిపించగల సామర్థ్యం ఆయనకే సొంతమన్నారు. ప్రధాని పదవి చేపట్టే అవకాశం వచ్చినప్పటికీ, ఆయన రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని తేల్చి చెప్పారన్నారు. ఇప్పటివరకు 12 సార్లు చీపురుపల్లి వచ్చి ఆయన ఈ ప్రాంతంపై తన అభిమానాన్ని చాటుకున్నారని గద్దే గుర్తు చేశారు. అదేవిధంగా అటు సినిమా పరిశ్రమలో 50 వసంతాలు పూర్తి చేసుకున్న నందమూరి బాలకృష్ణ, ఇటు రాజకీయాల్లోను రాణించడం హర్షణీయమన్నారు. ఈ సమావేశంలో బాలకృష్ణ అభిమాన సంఘం ప్రతినిధి ఎంఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి 50 కుటుంబాలు


సురేష్ సమక్షంలో జనసేనలో చేరిన యువకులు

గంట్యాడ: మండలంలోని పెణసాం, గంట్యాడ, మదుపాడ గ్రామాలకు చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరాయి. ఆదివారం బుడతనాపల్లి గ్రామంలోని గజపతినగరం నియోజకవర్గం సమన్వయకర్త మర్రాపు సురేష్ సమక్షంలో జనసేనలో చేరారు. పెణసాం గ్రామానికి చెందిన బోద బంగారునాయుడు, గంట్యాడ గ్రామానికి చెందిన బండారు గోపి, మదుపాడకు చెందిన నోడగల ఈశ్వరరావు తోపాటు తమ అనుచరులు జనసేనలో చేరారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చి జనసేనలో చేరినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బుడతనాపల్లికి చెందిన బి.ఎర్నినాయుడు, ఎల్లారావు, పి.సత్యనారాయణ, కోటి తదితరులు ఉన్నారు.

ఎంపీ దృష్టికి సాయిన్నచానల్ సమస్యలు


ఎంపీకి సమస్యలు వివరిస్తున్న టీడీపీ నాయకులు

రేగిడి: మండలంలో సంకిలి గ్రామ టీడీపీ క్యాడర్ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును ఆదివారం రణస్థలంలోని ఆయన స్వగృహంలో మర్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయన్నచానల్ సాగునీటి సమస్యలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వైసీపీ ప్రభుత్వంలో సాయిన్నచానల్‌పై నిర్లక్ష్య వైఖరిని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు సంకిలి గ్రామ టీడీపీ నాయకులు కర్రి రమణ, గంగు కృష్ణారావు, బింగి శ్రీరామమూర్తి స్థానిక విలేఖర్లకు తెలిపారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సాయన్నచానల్ పరిశీలించి తగుచర్యలు తీసుకుంటామని హమీఇచ్చారన్నారు.

రహదారుల పరిశీలన


రహదారిపై నిలిచిన నీటిని తోడిస్తున్న దృశ్యం

బొబ్బిలి: భారీ వర్షాలకు బొబ్బిలి పట్టణంలో జలమయమైన రోడ్లను, కాలువలను, నీరు నిలిచిపోయే ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి పురపాలక సిబ్బందితో కలిసి ఆదివారం పరిశీలించారు. ప్రజలకు అంతరాయం కలగకుండా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. శివాలయం వీధి రోడ్డులో నీరు నిలిచిపోయినట్లుగా గుర్తించి ఇన్చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, పారిశుధ్య సిబ్బందితో వెంటనే అవసరమైన చర్యలను తీసుకొని వాక్యూమ్ ట్యాంకర్‌తో నీటిని తోడివేయించారు.

మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం


గ్రామస్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు తెలిపారు. ఆదివారం కొండకెంగువ గ్రామంలో ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో చట్టాల అమలులో ప్రజా సహకారం కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణనే ధ్యేయంగా గ్రామస్థులు సహకరించాలని కోరారు. వినాయక చవితి ఉత్సవాలు ఆనందంగా జరుపుకోవాలని, మండపాల నిర్వహణకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామని, గ్రామాల్లో గంజాయి, సారా, అక్రమ మద్యం అమ్మకాలు జరిపితే ఎంతటి వారిపైనైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామ సర్పంచ్ కంచుపల్లి సుజాత, నాయకులు కోటీశ్వరరావు, శ్రీనివాసరావు, సత్యంనాయుడు, ప్రజలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వసతిగృహాల పరిశీలన

చీపురుపల్లి: పట్టణంలోని సమీకృత వసతిగృహం, బీసీ బాలుర, బాలికల వసతిగృహాలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పెట్టే ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమకు తెలియజేయాలని, వాటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వెళ్లి సత్వరమే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం వసతి గృహం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆయన వెంట టీడీపీ నాయకులు రౌతు కామునాయుడు, ముల్లు రమణ, పైల బలరాం, గవిడి నాగరాజు, సారేపాక సురేష్, ఆరతి సాహు, రెడ్డి లక్ష్మణరావు, చల్లా శ్రీరాం తదితరులున్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించండి

బొబ్బిలి: పట్టణ పరిధిలోగల అమ్మిగారి కోనేరు గట్టుపై అక్రమ నిర్మాణాలను తొలగించి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గతంలో ఇక్కడ అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని అప్పటి ఆర్డీవోకి ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేసి, వాటిపై తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికైనా మున్సిపల్, రెవెన్యూ అధికారులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

గంట్యాడ: గంట్యాడ గ్రామంలోని స్థానిక కేపీఎస్ బీఈడీ కళాశాలలో గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మహేంద్ర ఆసుపత్రి వైద్యుడు మహేంద్రగిరి మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నాయని తెలిపారు. మూడు రోజుల నుంచి జ్వరం తగ్గకుండా చిగుళ్ల నుంచి రక్తస్రావం, శరీరంపై ఎర్రటి దద్దుర్లు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే తప్పకుండా వైద్యుని సంప్రదించి రక్త పరీక్షలు చేసుకోవాలని, అశ్రద్ధ చేస్తే ప్రాణాపాయానికి దారి తీయవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు జయశంకర్ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు గెద్ద చిరంజీవి, స్థానిక ఆర్ఎంపీ రొంగలి రమేష్ నాయుడు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

● తుఫాన్ నేపథ్యంలో సముద్రం, నదీ తీర ప్రాంతాల్లో అధికారుల పర్యటన


బాడంగి: నదీ తీరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుధాకర్


జామి: గోస్తనీ తీర గ్రామాల్లో పర్యటిస్తున్న త హసీల్దార్ కృష్ణలత


భోగాపురం: ముక్కాంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సుధాకర్, తహసీల్దార్ సురేష్

తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని అధికారులంతా అప్రమత్తమయ్యారు. సముద్ర తీర ప్రాంతాలు, నదీ తీర ప్రాంతాల్లో పర్యవేక్షిస్తున్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జామి: మండలంలోని గోస్తనీ నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రజలు తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కృష్ణలత కోరారు. కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు మండలంలోని తీరప్రాంతాలను ఆమె ఆదివారం పరిశీలించారు. ఆయా గ్రామాల పెద్దలతో మాట్లాడారు. తుఫాన్ కారణంగా గోస్తనీ తీరంలోకి నీరు చేరుతోందని, ఇటువంటి సమయంలో నది వద్దకు వెళ్ల వద్దని సూచించారు. సంబంధిత వీఆర్వోలు, వీఏఏలు పరిస్థితిని సమీక్షిస్తారని తెలిపారు. ● **బాడంగి:** వర్షాల దృష్ట్యా మండలంలోని గొల్లాది గ్రామంలోని వేగావతి నదిని తహసీల్దార్ కె.సుధాకర్ పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసు పహారా కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వీఆర్వో సంతోష్, సర్పంచ్, ఎంపీటీసీ, టీడీపీ నాయకులు పామోటి గోవిందరావు, గ్రామ పెద్దలు శంకరరావు, సోమునాయుడు, రైతులు ఉన్నారు.

భోగాపురం: మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో శనివారం రాత్రి తుఫాన్ మండల ప్రత్యేక అధికారి, మెప్మా పీడీ బి.సుధాకర్, తహసీల్దార్ ఎం.సురేష్ పర్యటించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రాత్రి సమయంలో తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. ముక్కాం, కొండ్రాజుపాలెం, చేపలకంచేరు, ఎర్రముసలయ్యపాలెం తదితర గ్రామాల్లో పర్యటించి స్థానికులకు హెచ్చరికలు జారీ చేశారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణమే సమాచారం ఇవ్వాలన్నారు. స్థానికంగానే అందుబాటులో ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కిషోర్, వీఆర్వో రాంనాయుడు, మత్స్యకారులు పాల్గొన్నారు.

తుఫాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

బొబ్బిలి రూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలస గ్రామంలో తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక సచివాలయంలో తుఫాను కంట్రోల్ రూమ్(సహాయ కేంద్రం) ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు తెలిపారు. ఈ గ్రామం కొండలు, లోయలు, చెరువులు ఎక్కువగా వున్న గిరిజన ప్రాంతం కావడంతో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. వీఆర్వో కృష్ణమూర్తి, ఎంపీహెచ్‌డబ్ల్యు ఎల్ దివ్య, ఆశా వర్కర్ లక్ష్మి అందుబాటులో వుంటారని, ఎక్కడైనా తుఫాను వల్ల ప్రజలకు ఇబ్బంది ఏర్పడితే వెంటనే 9441414830 నెంబర్లో సంప్రదించాలన్నారు. పై ఫోన్ నెంబరు కు కాంటాక్ట్ చేయవలెనని తెలియజేసారు. శని, ఆది, సోమవారాలు మూడు రోజులపాటు కంటోల్ రూమ్ పనిచేస్తుందని తెలియజేసారు.

లోతట్టు గ్రామాలకు వరదభయం

రేగిడి: ఎడతెరిపిలేని వర్షాలతో నాగావళిలో వరదప్రవాహం పెరుగుతోంది. ఒకవైపు ఎగవునపడిన వర్షాలు, మరోవైపు మడ్డువలస, తోటపల్లి గేట్లు విడిచిపెట్టడంతో నాగావళికి వరదపోటు కనిపిస్తుంది. గత రెండురోజులుగా వర్షాలు కురుస్తుండటంతో మళ్లీ నాగావళికి వరద పెరిగి, మండలంలో 12 లోతట్టుగ్రామాల్లో వరదభయం మొదలైంది. మడ్డువలసలో రెండు గేట్లు విడిచిపెట్టడంతో నాగావళిలో 5800 క్యూసెక్కులు విడిచిపెడతుండగా, ఇంకా తోటపల్లి ఔట్‌ఫ్లో వాటర్ నాగావళికి వస్తుంది. దీంతో మండల రెవెన్యూ వర్గాలు మండలంలో 12లోతట్టు గ్రామాలను అప్రమత్తం చేస్తున్నాయి. తహసీల్దార్ ఎల్లారావు సంకిలి వద్ద వరద ప్రవాహన్ని ఆదివారం పరిశీలించారు. కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేసి వరదనీటిని పర్యవేక్షిస్తున్నారు.

రేగిడిలో చిరుజల్లులు

అల్పపీడన ప్రభావంతో రేగిడి మండలంలో గత రెండు రోజులుగా చిరుజల్లులు జోరుగా కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి మండలంలో కుండపోతగా వర్షాలు కురిశాయి. సంకిలి, బొడ్డవలస, దేవుదళ, పుర్లి, రేగిడి, ఆమదాలవలస, లక్ష్మీపురం, ఉంగరాడమెట్ట గ్రామాల్లో జల్లు పడగా, మిగితాగ్రామాల్లో ఓమోస్తరు వర్షం కురిసింది.

తీరంలో వైద్య శిబిరం

భోగాపురం: మండలంలోని తుఫాన్ దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా శనివారం ముక్కాం గ్రామంలో పోలిపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య శిబిరానికి వచ్చినవారికి వైద్య సేలు అందించి మందులు అందజేశారు. అలాగే ఎంపీడీవో ఎన్.అప్పలనాయుడు, ఈవోపీఆర్డీవో సురేష్ తీరంలో పర్యటించి వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు ఎండీ అబ్దుల్ సత్తార్, డి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

రహదారి కోత

భోగాపురం మండలంలోని గత మూడు రోజులు పాటు కురిసిన వర్షాలకు చాకివలస నుంచి ముగడపేట మీదుగా కంచేరుకు వెళ్లే రహదారి ముగడపేట సమీపంలో కోతకు గురయ్యింది. రహదారిపై పడిన వర్షపునీరు పక్కనే ఉన్న చెరువులోకి ప్రవహిస్తోంది. దీంతో రహదారి కోతకు గురయ్యింది. ఈ రహదారికి గతంలో మరమ్మతులు చేపట్టినప్పటికీ మళ్లీ కోతకు గురయ్యింది. దీంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు.


రేగిడి: సంకిలి వద్ద నాగావళి వరద నీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్


రేగిడి: సంకిలిలో కురుస్తున్న వర్షం


భోగాపురం: కోతకు గురైన రహదారి

ఘనంగా పవన్ పుట్టినరోజు వేడుకలు


రాజాం: వెండితో చేసిన పవన్‌కల్యాణ్ చిత్రం

డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఆదివారం వేడుకలు నిర్వహించారు. జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. పలుచోట్ల కేక్ కట్‌చేశారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


రాజాం: రక్తదానం చేస్తున్న జనసైనికులు


బొబ్బిలి రూరల్: వృద్ధురాలికి దుప్పట్లు, ఆహారం పంపిణీ చేస్తున్న జనసైనికులు


బొబ్బిలి: నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవికి జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన


బొబ్బిలి రూరల్: రక్తదాతలకు మెమెంటోలను అందజేస్తున్న జనసేన నేత బాబు, పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర


విజయనగరం: వృద్ధాశ్రయంలో అల్పాహారం అందిస్తున్న జనసైనికులు

క్లుప్తంగా..

సీఎంకు వినతిపత్రం


సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

లక్కవరపుకోట: రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగుల సమస్యలపై సీఎం చంద్రబాబునాయుడుకు శనివారం సాయంత్రం వినతిపత్రం అందజేసినట్లు జనసేన నాయకుడు, దివ్యాంగుల రాష్ట్ర జేఏసీ ఉపాధ్యక్షుడు కోలా మధు తెలిపారు. దివ్యాంగులకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ వారిని ఆదుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. సీఎం అన్నింటికి సానుకూలంగా స్పందించారన్నారు.

ఓం సదనంలో ప్రత్యేక పూజలు


108 శివలింగాలకు పూజలు చేస్తున్న దృశ్యం

కొత్తవలస: తుమ్మికాపల్లి గేట్ సమీపంలోని ఓం సదనంలో 108 శివలింగాలకు సదనం నిర్వాహకుడు అంపోలు ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆదివారం మహన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. కొత్తవలస-కె.కోటపాడు రోడ్డులో ఉన్న పంచాయతన రామలింగేశ్వర స్వామి ఆలయంలోను ప్రత్యేక పూజలు చేశారు.

పారసాం హెచ్‌ఎం మృతి

నెల్లిమర్ల: పారసాం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దన్నాన తిరుపతిరావు(58) శనివారం మృతిచెందారు. విజయనగరంలో ఉంటున్న ఆయన గుండె సంబంధిత సమస్యతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరి, చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. ఆదివారం ఉదయం ఆయన పార్థీవదేహాన్ని స్వస్థలం పాచిపెంటకు తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

జిల్లా క్రీడాకారులకు టీం చాంపియన్‌షిప్



చాంపియన్‌షిప్ సాధించిన జిల్లా క్రీడాకారులు

నెల్లిమర్ల: అనకాపల్లిలో గత మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, మెన్, జూనియర్ అండ్ సీనియర్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో టీం చాంపియన్ షిప్‌ను జిల్లా క్రీడాకారులు గెలుచుకున్నారని జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి చల్లా రాము వివరించారు. ఉమెన్ విభాగంలో కూడా చాంపియన్‌షిప్ కైవశం చేసుకున్నట్టు తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్ లక్ష్మనాయుడు, అధ్యక్షురాలు బెల్లాన లక్ష్మీనరేంద్ర, కార్యదర్శి చల్లా రాము, మధు శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

సీఐటీయూ శాంతి ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

గరివిడి: పాకిస్తాన్‌పై ఇజ్రాయిల్ దాడిని ఆపాలని, రష్యా ఉక్రెయిన్ యుద్ధం ఆగాలని ప్రపంచ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఆదివారం గరివిడిలో సీఐటీయూ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టీవీ రమణ, శంకరరావు, గౌరునాయుడు, కె.సురేష్, పి.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ సమ్మేళనాలు జయప్రదం చేయాలి

బొబ్బిలి: ఈనెల 1, 2, 3 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహిస్తున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళన కార్యక్రమాలు జయప్రదం చేయాలని సంఘం జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ మునకల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆదివారం బొబ్బిలి జెండా మహల్ వద్ద కరపత్రాలను విడుదల చేశారు.

రైల్వే అండర్ బ్రిడ్జి పరిశీలన

కొత్తవలస: కొద్దిపాటి వర్షానికే నీట మునుగుతున్న కొత్తవలస జంక్షన్‌లోని అండర్ బ్రిడ్జిని రైల్వేశాఖాధికారులు, కొత్తవలస మేజర్ పంచాయతీ ఈవో రత్నమాలిక ఆదివారం పరిశీలించారు. ప్రస్తుతం నీరు చేరినప్పుడు మోటార్లతో తోడిస్తున్నప్పటికీ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవలసి ఉంటుందన్నారు. ఈ అండర్ బ్రిడ్జికి ప్రత్యామ్నాయంగా పాదచారుల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జిని రైల్వేలైనులపై నిర్మాణం చేస్తే ఉపయోగపడుతుందని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు సూచిస్తున్నారు.

డ్రైవర్లు సంఘటితంగా ఉండాలి


మొక్కలు నాటుతున్న దృశ్యం

గంట్యాడ: డ్రైవర్లు అంతా సంఘటితంగా ఉండాలని, అప్పుడే ఏదైనా సాధించవచ్చని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఆదివారం గంట్యాడ గ్రామంలో డ్రైవర్ల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి నిబంధలు పాటిస్తూ వాహనాలు నడపాలని కోరారు. అనంతరం రహదారి పక్కన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దాట్ల కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

నీమాస్త్రంతో తెగుళ్ల నివారణ


నీమాస్త్రం తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల: నీమాస్త్రంతో పంటల చీడ, పీడలను తెగుళ్లను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం విభాగం ప్రతినిధి, ఐసీఆర్‌పీ ఎ.రామలక్ష్మి వివరించారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో నీమాస్త్రం తయారీపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. దేశీయ ఆవుమూత్రం, వేప ఆకులు, దేశీయ ఆవుపేడ, ఒక డ్రమ్ములో కలిపిన తర్వాత 48 గంటల తర్వాత నీమాస్త్రం తయారవుతుందని, ఇది మూడు నెలల వరకు నిల్వ ఉంటుందని ఆమె వివరించారు. రైతులు ఈ పద్ధతిని అనుసరించాలని ఆమె సూచించారు.